ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
MHR TV

మెదక్ సంపుటి: 19 సంచిక : 29 మంగళవారం 30, సెప్టెంబర్ 2025 పేజీలు: 08 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com



## మహిళల ఐక్యతకు ప్రతీక.. బతుకమ్మ పండుగ

ప్రకృతిని, పూలను పూజించే గొప్ప సంస్కృతికి మనది
పూలతో ఘనమైన బతుకమ్మలు,
ఆటపాటలతో సంబురాలు
ప్రకృతి పరిరక్షణకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం
రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి
బతుకమ్మ శుభాకాంక్షలు

02



# స్థానిక పోరుకు మోగిన నగారా

## షెడ్యూల్‌ను ప్రకటించిన ఎన్నికల సంఘం

మొత్తం మూడు దశల్లో నిర్వహణ
అక్టోబర్ 23న ఎంపీటీసీ, జెడ్పీటీసీ 1వ దశ
అక్టోబర్ 27న ఎంపీటీసీ, జెడ్పీటీసీ 2వ దశ
అక్టోబర్ 31 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు పంచాయతీ ఎన్నికలు
నవంబర్ 11వ తేదీన కౌంటింగ్

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

తెలంగాణలో స్థానిక ఎన్నికలకు నగారా మోగింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) రాణికుముదిని వెల్లడించారు. మొత్తం ఐదు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని వివరించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీలకు అక్టోబర్ 23న తొలివిడత, 27న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహిస్తామన్నారు. గ్రామ పంచాయతీలకు తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత నవంబర్ 8న నిర్వహిస్తామని వివరించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అదేరోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు

..మిగతా 2లో

# స్థానిక సమరానికి బీజేపీ సై..

కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై ప్రజలు విసిగిపోయారు
మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ
ఎన్నికలను ఉద్దేశపూర్వకంగానే ఆలస్యం చేశారు
ఈ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరేయడం ఖాయం
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు



తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో, ఈ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరేయడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. అధికార కాంగ్రెస్‌తో పాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కూడా ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, ఈ ఎన్నికల ఫలితాలు దానికి నిదర్శనంగా నిలుస్తాయని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి

..మిగతా 2లో



## పైరసీ రాయుడు.. నెలకు 9 లక్షలు జీతం

హైదరాబాద్ పోలీసులు షాకింగ్ రివీల్
ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీకి 2023లో రూ.22,400 కోట్లు నష్టం
టాలీవుడ్‌కి 2024లో రూ.3,700 కోట్లు నష్టం
బెట్టింగ్ యాప్‌లు, క్రిప్టో లింక్ బయటకు
హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్

02



## ఫిరాయింపు ఎమ్మెల్యేల క్రాస్ ఎగ్జామినేషన్

స్పీకర్ ముందే ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణ
నలుగురు ఎమ్మెల్యేలపై క్రాస్ ఎగ్జామినేషన్
అక్టోబర్ 1న ముఖ్య దశ
విచారణ ఫలితాలపై తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠ

02



## స్థానిక ఎన్నికల్లో గులాబీదే గెలుపు

కాంగ్రెస్ గ్యారెంటీ కార్డుల మోసాన్ని ఎండగడతాం
ప్రజలకు గుర్తుచేసేందుకే 'బాకీ కార్డులు' తెచ్చాం
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

తెలంగాణలో ఏ ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ పార్టీదే గెలుపని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు తమ పార్టీ పూర్తి సన్నద్ధతతో ఉందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు బాకీ పడిందని, వారి మోసాన్ని ప్రజల ముందు ఉంచేందుకే 'బాకీ కార్డులు' తీసుకొచ్చామని తెలిపారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ముందు 'గ్యారెంటీ కార్డుల' పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను గారడీ చేసిందని ఆయన ఆరోపించారు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను విస్మరించిందని, కాంగ్రెస్ చెప్పిన 'అభయహస్తం' కాస్తా 'భస్మాసుర హస్తం'గా మారిందని

..మిగతా 2లో



## ఇందిరా క్యాంటీన్ ప్రారంభం

కావాలనే యూరియా సరఫరా చేయడం లేదు
కొరతపై విపక్షాలు దుష్ప్రచారం
రైతులను కావాలనే బీఆర్ఎస్ రెచ్చగొడుతోంది
కామారెడ్డిలో మంత్రి సీతక్క

తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

హైదరాబాద్‌లోని పేదల ఆకలి తీర్చే లక్ష్యంతో ప్రభుత్వం 'ఇందిరా క్యాంటీన్' పథకాన్ని ప్రారంభించింది రేవంత్ సర్కార్. ఈ పథకం ద్వారా కేవలం ఐదు రూపాయలకే అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్), ఐదు రూపాయలకే మధ్యాహ్న భోజనం అందించనున్నారు. మోతీనగర్,

..మిగతా 2లో

## నా స్టాప్ వచ్చింది



చివరి రోజు బస్సులో ప్రయాణించిన సజ్జనార్
బస్సులో ప్రయాణించి టిక్కెట్ తీసుకున్న సీపీ
బస్సు దిగి కొత్త మార్గంలో వెళ్లవలసి ఉంది
నా అనుభవాలను త్వరలో మీతో పంచుకుంటాను
హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్

## కాంగ్రెస్‌ని కనిపించకుండా చేయాలని బీఆర్ఎస్ కుట్ర

అందుకే మాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు
ఎవరెన్నీ చేసినా.. మేమేందో ప్రజలకు తెలుసు
స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాట్ కామెంట్స్



తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :

బీఆర్ఎస్ పార్టీ తమపై బురద చల్లే ప్రయత్నం చేస్తోందని, కానీ రానున్న స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్

..మిగతా 2లో



# స్థానిక ఎన్నికల్లో గులాబీదే గెలుపు

**మొదటిపేజీ తరువాయి**

ఆయన వ్యాఖ్యానించారు. ఈ మోసాన్ని ప్రజలకు గుర్తు చేసేందుకే తమ పార్టీ 'బాకీ కార్డుల'ను తెరపైకి తెచ్చిందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తనదైన శైలిలో విమర్శలు చేశారు. ఉన్న హైదరాబాద్ నగరాన్ని పట్టించుకోవడం మానేసి, కొత్త నగరాన్ని నిర్మిస్తానంటూ ఆయన ఫోజులు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పాలనపై గ్రామాల్లోని రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులు తమకు అనుకూలంగా ఉన్నాయని, ప్రజలు తిరిగి కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని అన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఏ ఎన్నికలు ఎదురైనా బీఆర్ఎస్ విజయం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



# 'స్థానిక' పోరుకు మోగిన నగారా

**మొదటిపేజీ తరువాయి**

చేపడతామన్నారు. నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎస్ఈసీ తెలిపారు. రాష్ట్రంలో 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. 12,733 గ్రామపంచాయతీలు, 1,12,288 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాణికుముదిని వివరించారు.

**ముఖ్యమైన తేదీలివే..**

**ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు- తొలివిడత**

నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 9
స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 11
పరిశీలన: అక్టోబర్ 12
నామినేషన్ల ఉపసంహరణ అక్టోబర్ 15
ఎన్నికల తేదీ అక్టోబర్ 23
ఓట్ల లెక్కింపు నవంబర్ 11

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు రెండో విడత

నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 13
స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 15
పరిశీలన: అక్టోబర్ 16
నామినేషన్ల ఉపసంహరణ అక్టోబర్ 19
ఎన్నికల తేదీ అక్టోబర్ 27
ఓట్ల లెక్కింపు నవంబర్ 11

గ్రామ పంచాయతీ ఎన్నికలు తొలి విడత

నామినేషన్ల స్వీకరణ: అక్టోబర్ 17
స్వీకరణకు చివరి తేదీ: అక్టోబర్ 19
పరిశీలన: అక్టోబర్ 20
నామినేషన్ల ఉపసంహరణ అక్టోబర్ 23
ఎన్నికల తేదీ, ఫలితాలు అక్టోబర్ 31

గ్రామ పంచాయతీ ఎన్నికలురెండో విడత

నామినేషన్ల స్వీకరణ అక్టోబర్ 21
చివరి తేదీ: అక్టోబర్ 23
పరిశీలన: అక్టోబర్ 24
నామినేషన్ల ఉపసంహరణ అక్టోబర్ 27
ఎన్నికల తేదీ, ఫలితాలు నవంబర్ 4

గ్రామ పంచాయతీ ఎన్నికలుమూడో విడత

నామినేషన్ల స్వీకరణ అక్టోబర్ 25
చివరి తేదీ: అక్టోబర్ 27
పరిశీలన: అక్టోబర్ 28
నామినేషన్ల ఉపసంహరణ అక్టోబర్ 31
ఎన్నికల తేదీ, ఫలితాలు నవంబర్ 8

# మహిళల ఐక్యతకు ప్రతీక.. బతుకమ్మ పండుగ

- **ప్రకృతిని, పూలను పూజించే గొప్ప సంస్కృతికి మనది**
- **పూలతో ఘనమైన బతుకమ్మలు, ఆటపాటలతో సంబురాలు**
- **ప్రకృతి పరిరక్షణకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం**
- **రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి బతుకమ్మ శుభాకాంక్షలు**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

ప్రకృతిని.. పూలను పూజించే గొప్ప సంస్కృతికి నెలవు తెలంగాణ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలోని అక్కాచెల్లెళ్లందరికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తీరొక్క పూలతో తయారు చేసిన ఘనమైన బతుకమ్మలతో ఆడ బిడ్డలందరూ ఆట పాటలతో సద్దుల బతుకమ్మ సంబురాలు జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. తెలంగాణ సాముహిక జీవన విధానానికి, కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండుగ నిదర్శనమని అన్నారు. ఈ పండుగ ప్రజల సాంస్కృతిక వైభవం, మహిళల ఐక్యతను చాటి చెప్పడంతో పాటు, అనేక సామాజిక అంశాలతో నిండి ఉందన్నారు. ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తొమ్మిది రోజుల పాటు రాష్ట్రమంతటా అత్యంత వైభవంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. బతుకమ్మ విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పడానికి, సరూర్ నగర్ స్టేడియంలో 10 వేల మంది మహిళలతో ప్రభుత్వం ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తుందని సీఎం అన్నారు. ప్రకృతి పరిరక్షణకు ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని .. చెరువులు, కుంటలను పదిలంగా కాపాడి భవిష్యత్ తరాలకు వారసత్వంగా అందిస్తుందని.. అందుకే బతుకమ్మ చెరువును పునరుద్దరించిందని గుర్తు చేశారు.

# పైరసీ రాయుడు..నెలకు 9 లక్షలు జీతం

- **హైదరాబాద్ పోలీసులు షాకింగ్ రివీల్**
- **ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీకి 2023లో రూ.22,400 కోట్లు నష్టం**
- **టాలీవుడ్‌కి 2024లో రూ.3,700 కోట్లు నష్టం**
- **బెట్టింగ్ యాప్‌లు, క్రిప్టో లింక్ బయటకు**
- **హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్**



**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పైరసీ రాయుళ్ల విషయమై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినిమాల పైరసీపై లోతైన దర్యాప్తు చేసి దేశంలోనే తొలిసారిగా ఒక పైరసీ ముఠాను పట్టుకున్నామని తెలిపారు. తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫిర్యాదు మేరకు ఈ కేసును నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. పైరసీ కారణంగా సినీ పరిశ్రమ భారీగా నష్టపోతోందని సీపీ వివరించారు. 2023లో దేశవ్యాప్తంగా సినీ పరిశ్రమకు రూ.22,400 కోట్లు, 2024లో తెలుగు పరిశ్రమకు రూ.3,700 కోట్లు పైరసీ వల్ల నష్టం వాటిల్లిందని తెలిపారు. పైరసీ సినిమాల వల్ల ప్రజలు ఆన్‌లైన్ బెట్టింగ్‌కు కూడా అలవాటు పడుతున్నారని ఆయన చెప్పారు. బెట్టింగ్ యాప్ నిర్వాహకులు పైరసీ చేసేవారికి డబ్బులిచ్చి ప్రోత్సహిస్తున్నారని, పైరసీ మూవీల ద్వారా తమ యాప్‌లను ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు తమిళనాడులోని కరూర్ చెందిన సిరిల్ అని పోలీసులు గుర్తించారు. అతను 2020 నుంచి నాలుగు పైరసీ వెబ్‌సైట్‌లను నడుపుతున్నాడు. కంప్యూటర్ సైన్స్ చదివిన సిరిల్ సులభంగా డబ్బు సంపాదించడానికి ఈ మార్గాన్ని ఎంచుకున్నాడు. ప్రపంచవ్యాప్తంగా ఏజెంట్లను నియమించుకుని అన్ని భాషల సినిమాలను పైరసీ చేస్తున్నాడు. హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో ఉన్న మంత్ర మాల్ థియేటర్‌లో జానా కిరణ్ కుమార్ అనే వ్యక్తి హై ఎండ్ కెమెరా ఉన్న ఫోన్‌తో సినిమాలను రికార్డ్ చేశాడు. స్క్రీన్ ఆఫ్ అయినప్పటికీ వీడియో రికార్డ్ చేసే యాప్‌లను ఉపయోగించి ఎవరికీ అనుమానం రాకుండా ఈ పని చేశాడని తెలిపారు. 22 ఏళ్ల అశ్విని కుమార్ అనే మరో నిందితుడు డిజిటల్ మీడియా సర్వర్లను హ్యాక్ చేసి సినిమాలు అప్‌లోడ్ చేస్తున్నాడు. ఇతను 1020 సినిమాలు నేరుగా సర్వర్లను హ్యాక్ చేసి అప్‌లోడ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇతను కేవలం సినిమాలకు సంబంధించి మాత్రమే కాకుండా ప్రభుత్వ విభాగాల వెబ్‌సైట్‌లు, ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌ను కూడా హ్యాక్ చేయగల సామర్థ్యం కలిగి ఉన్నాడని తెలిపారు. ఈ నిందితులు బిట్‌కాయిన్‌లు, క్రిప్టో కరెన్సీ రూపంలో డబ్బులు తీసుకుంటున్నారు. ప్రతి సినిమాకు 300 నుండి 400 డాలర్లు సంపాదిస్తున్నాడు. ఈ డబ్బును భారతీయ కరెన్సీలోకి మార్చుకోవడానికి అశ్విని కుమార్ అనే వ్యక్తి సహకరిస్తున్నాడు. బెట్టింగ్ యాప్‌లైన 1xbet, 4ra bet, rajbet, Parimatch నిర్వాహకులు సిరిల్‌కు నెలకు రూ.9 లక్షల జీతంలాగా ఇస్తున్నారు. పోలీసులు సిరిల్ వద్ద కుబేర మూవీతో సహా అనేక సినిమాలను, అలాగే 10 క్రిప్టో కరెన్సీ వాలెట్‌లు, మూడు బ్యాంకు ఖాతాలను గుర్తించారు. అశ్విని కుమార్ ఇంటి చుట్టూ 22 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నాడని, పోలీసులు రావడం చూసి తన ఫోన్ డేటాను డిలీట్ చేశాడని, కానీ హార్డ్ డిస్క్‌లో ఉన్న డేటాను మాత్రం డిలీట్ చేయలేకపోయాడని సీపీ తెలిపారు.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల క్రాస్ ఎగ్జామినేషన్

- **స్పీకర్ ముందే ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణ**
- **నలుగురు ఎమ్మెల్యేలపై క్రాస్ ఎగ్జామినేషన్**
- **అక్టోబర్ 1న జరగనున్న ముఖ్య దశ**
- **విచారణ ఫలితాలపై తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠ**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం :**

తెలంగాణ రాజకీయాల్లో మరో ఉత్కంఠకర దశ సోమవారం చోటుచేసుకుంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల విచారణ స్పీకర్ ముందే జరిగింది. ఈ సందర్భంగా నలుగురు ఎమ్మెల్యేలపై క్రాస్ ఎగ్జామినేషన్ జరగగా, అక్టోబర్ 1న ఫిరాయింపు ఎమ్మెల్యేల అడ్వకేట్‌లను బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అడ్వకేట్‌లు క్రాస్ ఎగ్జామిన్ చేయనున్నారు. విచారణ సమయంలో స్పీకర్ ముందు హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, చింతా ప్రభాకర్. ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కాలే యాదయ్యపై వివిధ ఆసక్తికర ప్రశ్నలు వేసి సవాళ్లు విసురుకున్నారు. ముఖ్యంగా పార్టీ అనుమతి మేరకే ఫిరాయింపులపై ఫిర్యాదు చేశారా, కాంగ్రెస్‌లో చేరిన తరువాత పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు లేదా వంటి ప్రశ్నలు చర్చకు రంగం కల్పించాయి. “పార్టీ అనుమతి మేరకే ఫిరాయింపులపై ఫిర్యాదు చేశాం. సుప్రీం కోర్ట్‌కు కూడా పార్టీ తరపునే వాదనలు సమర్పించాం.” అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. విచారణలో ఫిరాయింపు ఎమ్మెల్యేల లాయర్లు వాదనగా పేర్కొన్నారు, నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌ను కలిసే ప్రక్రియ పార్టీ మార్పు అని చూడరాదు. మార్చిలోనే ఫిరాయింపుల వేతనం నుంచి 5వేలు కట్ కాలేదని కూడా వారు చెప్పారు. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జంద్యాల రవిశంకర్ వాదనలో పాల్గొనడంపై తమ అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు, అలాగే స్పీకర్ లీగల్ అడ్వైజర్‌గా వాదనలు వినిపించడం సబబు కాదని అన్నారు. ఈ విచారణను క్రమంగా గమనిస్తే, 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రావని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే, ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తు ఇంకా అనిశ్చితంగా ఉంది. రాజకీయ వేదికపై ఈ కేసు మరిన్ని ఉత్కంఠలు, చర్చలకు దారితీస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# స్థానిక సమరానికి బీజేపీ సై..

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం రాష్ట్రపతి, గవర్నర్ల పేర్లతో ఇప్పటి వరకు ఎన్నికలను అనవసరంగా ఆలస్యం చేసిందని రాంచందర్ రావు విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనతో ప్రజలు విసిగిపోయారని, ఇప్పుడు రెండేళ్లలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై కూడా పూర్తి విరక్తితో ఉన్నారని ఆయన ఆరోపించారు. తమ పార్టీ విజయానికి బలమైన పునాదులు ఉన్నాయని రాంచందర్ రావు తెలిపారు. ప్రస్తుతం బీజేపీకి 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలతో పాటు ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారని గుర్తుచేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు తాను ఇప్పటికే 23 జిల్లాల్లో యాత్రలు పూర్తి చేశానని, మరో నాలుగు జిల్లాల పర్యటన మిగిలి ఉందని వివరించారు. ప్రజల నాడిని బట్టి చూస్తే, స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం తథ్యమని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఈరోజు విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, రాష్ట్రంలో మొదట ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ తర్వాత గ్రామ పంచాయతీలకు సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించనున్నారు.

# నా స్టాప్ వచ్చింది..

- **చివరి రోజు బస్సులో ప్రయాణించిన సజ్జనార్**
- **బస్సులో ప్రయాణించి టిక్కెట్ తీసుకున్న సీపీ**
- **బస్సు దిగి కొత్త మార్గంలో వెళ్లవలసి ఉంది**
- **నా అనుభవాలను త్వరలో మీతో పంచుకుంటాను**
- **హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్**

**హైదరాబాద్, తెలంగాణ బ్యూరో :**

నాలుగు సంవత్సరాలుగా టీజీఎస్ఆర్టీసీలో బాధ్యతలు నిర్వర్తించిన అనంతరం, ఇప్పుడు బస్సు దిగి కొత్త మార్గంలో పయనించాల్సిన సమయం ఆసన్నమైందని వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల భారీగా ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి. టీజీఎస్ఆర్టీసీ ఎండీగా ఉన్న సజ్జనార్‌ను హైదరాబాద్ సీపీగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియమించింది. ఈ నేపథ్యంలో సజ్జనార్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రయాణాలు ఆగిపోవచ్చు, కానీ ప్రయాణికులు ముందుకు సాగుతూనే ఉంటారు. ఇప్పుడు నా బస్సును పార్క్ చేసి తదుపరి సవాల్ దిశగా ప్రయాణం వేగవంతం చేయాల్సిన సమయం వచ్చింది. టీజీఎస్ఆర్టీసీకి డ్రైవర్లు, కండక్టర్లు జీవనాడి. అంకితభావంతో పనిచేసిన ప్రతి ఉద్యోగికి, ప్రయాణికుడికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని ఆయన పేర్కొన్నారు. త్వరలో టీజీఎస్ఆర్టీసీలో తన అనుభవాలను వివరణాత్మకంగా పంచుకుంటానని సజ్జనార్ తెలిపారు.

**సాధారణ ప్రయాణికుడిలా బస్సులో ప్రయాణించిన సజ్జనార్**

టీజీఎస్ఆర్టీసీ ఎండీగా తన చివరి రోజున వీసీ సజ్జనార్ ప్రజారవాణాపై తన అనుబంధాన్ని చాటుకుంటూ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. సాధారణ ప్రయాణికుడిలా లక్డీకాపుల్ టెలిఫోన్ భవన్ బస్టాండ్ నుంచి బస్ భవన్ వరకు 113 I/M రూట్ బస్సులో ప్రయాణించారు. యూపీఐ ద్వారా చెల్లింపు చేసి కండక్టర్ వద్ద టికెట్ తీసుకున్నారు. అనంతరం ప్రయాణికులతో సరదాగా ముచ్చటించారు.

# 'ఇందిరా క్యాంటీన్' ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

మింట్ కాంపౌండ్ ప్రాంతాల్లో ఈ క్యాంటీన్లను జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ కూడా పాల్గొన్నారు. ఈ పథకం కింద ఒక్కో అల్పాహారంపై జీహెచ్ఎంసీ రూ.14, మధ్యాహ్న భోజనంపై రూ.24.83 భరించనుంది. దీని వల్ల ఒక్కో వ్యక్తిపై నెలకు సుమారు రూ.3,000 ఆర్థిక భారం తగ్గుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అల్పాహారం కోసం 'హరే రామ, హరే కృష్ణ' సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. సాధారణంగా రూ.19 ఖర్చయ్యే టిఫిన్‌ను కేవలం రూ. 5కే, అలాగే రూ. 30 ఖర్చయ్యే భోజనాన్ని రూ. 5కే అందిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మొదటగా ప్రజలకు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు. ఇందులో భాగంగా..గత 10 సంవత్సరాలుగా లేని రేషన్ కార్డులు తమ ప్రభుత్వం అందించిందని, అలాగే సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. అలాగే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. అంతేకాకుండా మహిళా సాధికారత కోసం రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల యజమానులుగా చేసే ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. మహిళా సంఘాల్లో సభ్యుల సంఖ్యను 16 నుంచి 65 వరకు మార్చి, సున్నా వడ్డీకే రుణాలు ఇస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా.. హైదరాబాద్‌లో పనిచేసే వారికి అక్కడే ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని.. కొల్లూరులో ఇళ్లు నిర్మించి ఇవ్వడం వల్ల ఉపయోగం ఉండదని అన్నారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతూ.. ఇందిరా క్యాంటీన్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# కాంగ్రెస్‌ని కనిపించకుండా చేయాలని బీఆర్ఎస్ కుట్ర

**మొదటిపేజీ తరవాయి**

పార్టీ మేము చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల హృదయాలకు తెలుసునని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పెద్దలు 10 సంవత్సరాల్లో రాష్ట్రంలో ఆర్థిక, పాలన వ్యవస్థలను విధ్వంసం చేస్తే ప్రణాళికా ప్రకారం వాటిని సరి చేసుకుంటూ ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. రాష్ట్రంలోని రైతులు, మహిళలు, యువత కోసం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వారి హృదయాలకు, మనసులకు బాగా తెలుసు అని ఆయన అన్నారు. సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, ఇందిరమ్మ ప్రభుత్వం బీసీల దశాబ్దాల కోరికను నెరవేర్చిందని ఆయన అన్నారు. ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి సర్వే నిర్వహించి బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించామన్నారు. ప్రజల కోసం నిలబడిన కాంగ్రెస్ పార్టీని కనిపించకుండా చేయాలని బీఆర్ఎస్ నాయకులు మాపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, కుట్రపూరితంగా కోర్టులకు పంపిస్తున్నారని అన్నారు. అలాగే ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడు ఎకరాల భూమి హామీలు ఇచ్చి బీఆర్ఎస్ పెద్దలు అమలు చేయలేదు అన్నారు. లక్ష రూపాయల రైతు రుణమాఫీని 10 సంవత్సరాల్లో కూడా పూర్తిగా చేయలేకపోయారని డిప్యూటీ సీఎం విమర్శించారు. లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం కుంగిపోయిందన్నారు. అయితే కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిందన్నారు. యువతకు గ్రూప్ 1, గ్రూప్ 2 తో పాటు ఇప్పటికే 60,000 ఉద్యోగాలు, 21 వేల కోట్ల రైతు రుణమాఫీ, తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రైతు భరోసా, 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్తు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, సన్న ధాన్యం సాగు చేసే రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్, 5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా మొదటి దశలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం ఇందుకుగాను 22,500 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో 1.05 కోట్ల కుటుంబాలు ఉండగా 96 లక్షల కుటుంబాలకు మనిషికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం, బహిరంగ మార్కెట్లో 56 రూపాయలు కిలో ధర పలుకుతున్న సన్నబియ్యాన్ని ఇందిరమ్మ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుంది అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం, స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి ఏటా 20 వేల కోట్ల వడ్డీలేని రుణాలు పంపిణీ చేసి ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తున్నాం అన్నారు.



## పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలి

- **మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి...**

**శామీర్ పేట సెప్టెంబర్ 29(ప్రజాస్వరం)**



తహసీల్దార్ లాగిన్ ఐడిలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను త్వరిగతిన పూర్తి చేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా విసి హాల్ లో డిఆర్ఓ హరిప్రియతో కలిసిరె వెన్యూ పెండింగ్ అంశాలపై అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి, ఆర్ఓఆర్, టిజిపాస్ దరఖాస్తులపై సమీక్ష నిర్వహిస్తు త్వరితగతిన పెండింగ్ క్లియర్ చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. మండలాల వారీగా సమీక్షించి పెండింగ్ కు గల కారణాలను అడిగి తెలుసుకొని తగిన సూచనలు జారీ చేసారు. ప్రభుత్వ భూములను కాపాడే దిశగా చర్యలు తీసుకోవాలని, అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. కుల, నివాస ధృవీకరణ పత్రాల జారీలో జాప్యం లేకుండా చొరవ తీసుకొని పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్డిఓలు ఉపేందర్ రెడ్డి, శ్యాం ప్రకాష్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ సిబ్బందికి చీరలు, స్వీట్ బాక్స్ లు పంపిణీ

- **మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం రమేష్**

**శామీర్ పేట సెప్టెంబర్ 29(ప్రజాస్వరం).**

మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పొన్నాల గ్రామంలో సోమవారం బతుకమ్మ పండుగ, దసరా సందర్భంగా గ్రామ మాజీ ఉపసర్పంచ్, శామీర్ పేట మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గడ్డం రమేష్ పొన్నాల మున్సిపల్ సిబ్బందికి చీరలు, స్వీట్ బాక్స్ లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ వినూత్నరెడ్డి, పంచాయతీ కార్యదర్శి కే. దేవేందర్ రావు, బిల్ కలెక్టర్ కమటం వికాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

**తాండూరు, సెప్టెంబర్ 29(ప్రజా స్వరం):**

తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సునీత బాల్రాజ్ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో తాండూరు ఎంఎల్ఏ బు మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఈ సంధర్బంగా మాట్లాడుతూ ఇళ్లు లేని ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని చెప్పారు. తమ సొంతింటి కళను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, సీఎం రేవంత్ రెడ్డి కి, ఎమ్మెల్యే బీఎంఆర్ ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని లబ్ధిదారులు తెలిపారు. లబ్ధిదారులతో కలిసి ఎమ్మెల్యే బీఎంఆర్ భోజనం చేశారు.







# ప్రకృతిని ఆరాధించే పండుగే బతుకమ్మ

- **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా**

**శామీర్ పేట సెప్టెంబర్ 29(ప్రజాస్వరం)**

తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆటాపాటలతో గౌరమ్మను కొలుస్తూ ప్రకృతిని ఆరాధించే పండుగే బతుకమ్మని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం తరపున జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ, ఎడి సర్వే అండ్ ల్యాండ్, జిల్లా ట్రెజరీ శాఖల ఆధ్వర్యంలో ఘనంగా బతకమ్మ సంబరాలు జరిగాయి. తీరొక్క పూలతో పెద్దగా బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో ఘనంగా బతుకమ్మను ఆడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి శారద, ఎడి సర్వే అండ్ ల్యాండ్ అధికారి శ్రీనివాసులు, జిల్లా ఇంఛార్జి ట్రెజరీ అధికారి హైదర్ అలీ, మహిళ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోషణ మాసంకు సంబంధించి పౌష్టికాహారం, ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కు సంబంధించి టీచర్లు తయారు చేసిన మెటిరియల్ పై జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ వారు ఏర్పాటు చేసిన స్టాల్స్ ను అదనపు కలెక్టర్ చూసారు.



## దేవులపల్లి రమేశ్ కు జాతీయ సాహితీ కిరీటి పురస్కారం



**నంగునూర్, సెప్టెంబర్ 29**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రానికి చెందిన కవి రచయిత దేవులపల్లి రమేశ్ కు జాతీయ సాహితీ కిరీటి పురస్కారం లభించింది. హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో జరిగిన శ్రీశ్రీ కళా వేదిక,155 వ పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా శ్రీశ్రీ కళా వేదిక, మేనేజింగ్ డైరెక్టర్ డా.కత్తి మండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, యువజన అధ్యక్షులు గరిమెళ్ళ రాజేంద్రప్రసాద్, చేతుల మీదుగా కవి, రచయిత, బీసీ గురుకుల ఎంజేపీ తెలుగు అతిధి ఉపాధ్యాయుడు, దేవులపల్లి రమేశ్ ను సాహిత్య సేవలు అందిస్తున్నందుకు గాను జాతీయ సాహితీ కిరీటి పురస్కారంతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా రచయిత దేవులపల్లి రమేశ్, మాట్లాడుతూ. తెలుగు భాషను కాపాడుకోవాల్సిన ప్రతి తెలుగు వారి మీద ఉందని జాతీయ స్థాయిలో సాహితీ కిరీటి పురస్కారం ఇచ్చినందుకు సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్య లక్ష్మి, నూక సంపత్ కుమార్,సతీష్, విజయ్ కుమార్, కరుణాకర్,వివిధ రాష్ట్రాల కవులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరు జమ్మి చెట్టును నాటాలి

- **రాష్ట బీ సీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్**

**వికారాబాద్, సెప్టెంబర్ 29(ప్రజా స్వరం):**

తెలంగాణ ప్రజలు పూజించుకునే జమ్మి చెట్టును తెలంగాణ వృక్షంగా అప్పటి బీ ఆర్ ఎస్ ప్రభుత్వం గుర్తించిందనీ రాష్ట బీ సీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్ అన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల అంతరించిపోతున్న జమ్మి చెట్టును, దాని విశిష్టతను గుర్తించిన మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్ ప్రతి ఊరిలో, ప్రతి గుడిలో జమ్మి చెట్టు ఉండేలా గ్రీన్ ఇండియా ఛాలెంజకు శ్రీకారం చుట్టారని తెలిపారు. వికారాబాద్ జిల్లా మాదులపల్లి గ్రామము లో సంగమేశ్వర దేవాలయం దగ్గర ఆలయ కమిటీ సభ్యులు సోమిరెడ్డి , రాములు , నాయకులు అశోక్ , సుజీత్ తో కలిసి శుభ ప్రద్ పటేల్ జమ్మి చెట్టును నాటారు. ఆ జమ్మి కొరత ఉండొద్దనే ఉద్దేశంతోనే మాజీ సంతోష్ కుమార్ లక్ష్యం నెరవేర్చడం కోసం ఈ మహాయజ్ఞంలో తాను భాగస్వామి కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర వృక్షం జమ్మిని ప్రతీ ఊరు, ప్రతీ గుడిలో నాటాలనీ గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ఉద్దేశమనీ, ప్రతి ఒక్కరు జమ్మి చెట్టును నాటాలని శుభప్రద్ పటేల్ పిలుపునిచ్చారు.



## పునరుద్దరణ పనులు తక్షణమే చేపట్టాలి: మెతుకు ఆనంద్

**వికారాబాద్, సెప్టెంబర్ 29(ప్రజా స్వరం):**

వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం మాల సోమారం, తొర్మామిడి బంట్వారం గ్రామాలలో భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాలలో సోమ వారం వికారాబాద్ జిల్లా బీ ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పర్యటించారు. పర్యటనలో భాగంగా గ్రామాల్లో తిరుగుతూ భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలు, రోడ్లు, కల్వర్టులు, శిథిలావస్థకు చేరుకున్న ఇల్లు, దెబ్బతిన్న మిషన్ భగీరథ పైపులు, విద్యుత్ స్తంభాలు ట్రాన్స్ఫార్మర్లను పరిశీలించారు. రైతులతో మాట్లాడి జరిగిన పంట నష్టాన్ని తెలుసుకున్నారు. నష్టపోయిన ప్రతి రైతన్నకు పంట నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. వరద ముంపు ప్రాంతాల్లో రోడ్లు, నీటి సరఫరా మరియు విద్యుత్ వ్యవస్థలు పునరుద్ధరించాలి. అలాగే గ్రామాల్లో ఆవాసాల మధ్య చేరిన వర్షపు నీరు వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తకుండా పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


**ఇంటింటికీ "కాంగ్రెస్ బాకీ కార్డులు": మెతుకు ఆనంద్**

మోసపురిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు పడ్డ బకాయిలను గుర్తు చేసేందుకు బీ ఆర్ ఎస్ పార్టీ తీసుకువచ్చిన బాకీ కార్డు ఉద్యమంలో భాగంగా కోట్ పల్లి మండలం లోని *ఎన్నారం గ్రామంలో పర్యటించిన వికారాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్కో ట్ పల్లి మండల పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ బకాయి కార్డులను పంపిణి చేస్తూ, కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజలకు వివరించారు. ప్రజలను దారుణంగా మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.








# యువ క్రీడాకారులు రాష్ట్రానికి, దేశానికి గౌరవం తీసుకురావాలి

- ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి
- బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**వికారాబాద్, సెప్టెంబర్ 29(ప్రజా స్వరం):**

మోయినాబాద్‌లోని జ్వాలా గుత్తా అకాడమీలో 2వ వేమూరి సుధాకర్ స్మారక తెలంగాణ సబ్ జూనియర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ 2025 ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే &డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులలో క్రమశిక్షణ,పట్టుదల పెంపొందించడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడతాయని, యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు ఇలాంటి టోర్నమెంట్‌లు దోహదపడతాయని పేర్కొన్నారు.అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడంలో తెలంగాణ రాష్ట్రానికి ఉన్న అవకాశాలను ప్రస్తావిస్తూ, యువ క్రీడాకారులు మరింత కృషి చేసి రాష్ట్రానికి, దేశానికి గౌరవం తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు.

# కష్టాల నుండి కిరీటం వరకు – ఆది దీక్షిత ప్రయాణం

**దౌల్తాబాద్, సెప్టెంబర్ 29(ప్రజాస్వరం ):**

ఇటీవల వెలువడిన గ్రూప్-1 ఫలితాల్లో దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఆది దీక్షిత డీఎస్పీగా ఎంపిక కావడం విశేషం. ఈ విజయం కేవలం వ్యక్తిగత ప్రతిభ మాత్రమే కాకుండా కుటుంబం, గురువులు, గ్రామం కలసి గర్వపడే ఘట్టం. మధ్య తరగతి కుటుంబం - మహా విజయ లక్ష్యం దీక్షిత చిన్ననాటి నుంచే మధ్య తరగతి కుటుంబంలో పెరిగింది. తండ్రి ఆది వెంకన్న, తల్లి ఆది రేఖ వ్యవసాయం చేసుకుంటూ కష్టపడి జీవనం సాగించారు. కానీ తమ కొడుకు చదువులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలగన్నారు.ఆ కలను నిజం చేయడమే తన ధ్యేయంగా భావించారు.

**వివేకానంద పాఠశాలలో పునాది**

స్థానికంగా ఉన్న వివేకానంద పాఠశాలలోనే దీక్షిత తన విద్యాభ్యాసాన్ని చేశారు. అక్కడి




గురువుల మార్గదర్శకత, క్రమశిక్షణ, సమయపాలన తనకు పునాది వేసింది. పాఠశాల రోజుల్లోనే "జీవితంలో పెద్దదిగా ఆలోచించాలి, కష్టపడాలి" అనే విలువలు తనలో నాటుకుపోయాయి.

**ప్రయత్నం – పట్టుదల – విజయం**

గ్రూప్-1 పరీక్షలకు సన్నద్ధమవడం చిన్న విషయం కాదు. రోజంతా చదువులో మునిగిపోవడం, వైఫల్యాలను తట్టుకోవడం, మళ్లీ కొత్త ఉత్సాహంతో ముందుకు సాగడం దీక్షిత అలవాటు చేసుకుంది. ఒకవైపు కుటుంబ పరిస్థితులు కష్టంగా ఉన్నా, మరోవైపు ఆశయానికి కట్టుబడి చదువుతోనే తన భవిష్యత్తును నిర్మించుకున్నది. చివరికి డీఎస్పీ ఉద్యోగం సాధించడం తన పట్టుదలకు నిదర్శనం.

**యువతకు ఆదర్శం**

ఈ విజయంతో దీక్షిత, దౌల్తాబాద్ యువతకు ఆదర్శంగా నిలిచింది. "కష్టానికి ఫలితం తప్పక ఉంటుంది" అనే నమ్మకాన్ని తన జీవితంతో నిరూపించింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని కలలు కంటున్న అనేక మంది యువతకు దీక్షిత ప్రయాణం ప్రేరణగా మారింది. మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన ఒక సాధారణ యువతి కష్టంతో, పట్టుదలతో, తల్లిదండ్రుల ఆశీర్వాదంతో డీఎస్పీ స్థాయి వరకు చేరుకోవడం నిజంగా విశేషం. దౌల్తాబాద్ పేరు వెలుగులోకి తీసుకొచ్చిన ఆది దీక్షితకు భవిష్యత్తు మరింత వెలుగొందాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.



# ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవి విరమణ సర్వసాధారణం

- మేడ్చల్ జిల్లా పరిషత్ సి ఈ ఓ కాంతమ్మ
- ఘనంగా సంపత్ కుమార్ పదవి విరమణ మహోత్సవం

**శామీర్ పేట సెప్టెంబర్ 29(ప్రజాస్వరం)**

ప్రభుత్వ ఉద్యోగుల జీవితంలో పదవి విరమణ సర్వసాధారణమని ఎలాంటి ఒత్తిడికి లోను కావద్దని విశ్రాంత జీవితం ఆరోగ్యంగా ఆనందంగా గడపాలని మేడ్చల్ జిల్లా పరిషత్ సీఈవో కాంతమ్మ ఆకాంక్షించారు. సోమవారం శామీర్ పేట మండల పరిషత్ సమావేశ మందిరంలో శామీర్ పేట ఇంచార్జి ఎంపీడీవో, జడ్పీ సూపరిండెంట్ సంపత్ కుమార్ పదవి విరమణ వీడ్కోలు మహోత్సవ అభినందన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేడ్చల్ జిల్లా పరిషత్ సీఈవో కాంతమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంతమ్మ మాట్లాడుతూ... పదవి విరమణ పొందిన శామీర్ పేట ఎంపీడీఓ సంపత్ కుమార్ వివాదరహితుడని, సౌమ్యుడని, అందరితో కలివిడిగా ఉండి ఉత్తమ సేవలందించారని ప్రశంసించారు. అనంతరం సంపత్ కుమార్ మాట్లాడుతూ.. తనకు సహకరించిన తనతో వివిధ ప్రాంతాల్లో కలిసి పనిచేసిన సహచరులను, తనను ప్రోత్సావించిన కుటుంబ సభ్యులను సహకరించిన వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పదవి విరమణ పొందిన ఎంపీడీఓ సంపత్ కుమార్ దంపతులను సీఈఓ, డిప్యూటీ సీఈఓ, అధికారులు, ప్రజాప్రతినిధులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా పరిషత్ డిప్యూటీ సిఈఓ నీరజా, ఎంసీ పల్లి ఇంచార్జి ఎంపీడీఓ రాజారత్నం, సీనియర్ అసిస్టెంట్ సంపత్ కుమార్, మాజీ ఎంపీపీ దాసరి ఎల్లుభాయి, పంచాయతీ కార్యదర్శిలు శశికుమార్, వేణుగోపాల్, నారాయణ, విజయ్ కుమార్, వివిధ విభాగాల అధికారులు, బిల్ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



- జిల్లాఅదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**వికారాబాద్, సెప్టెంబర్ 29(ప్రజా స్వరం):**

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లాఅదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 43 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల దరఖాస్తులను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుదీర్ డి ఆర్ ఓ మంగీలాల్ వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.







# వికారాబాద్ జిల్లాల్లో ఘనంగా సద్దుల బతుకమ్మ ఉత్సవాలు

**వికారాబాద్, సెప్టెంబర్ 29(ప్రజా స్వరం):**

వికారాబాద్ జిల్లా లో సోమ వారం సద్దుల బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో పట్టణాలు,గ్రామాల్లో నిర్వహించిన ఉత్సవాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శాంతినగర్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు తాండూరు పట్టణంలోని శాంతినగర్ కాలనీలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. పెద్దేముల్ జడ్పిటీసి మాజీ సభ్యురాలు ఉప్పరి స్వరూప మల్లేశం ఆధ్వర్యంలో మహిళలు భారీగా హాజరై బతుకమ్మలను పేర్చి ఆడిపాడుతున్నారు. నవరాత్రుల సందర్భంగా మహిళలు తొమ్మిదిరకాల మట్టిగాజులు వేసుకొని గౌరమ్మను పూజించారు. ఇలా 9 రోజుల పాటు వైవిధ్యంగా బతుకమ్మలను పేర్చి సంబరాలను చేసుకుంటున్నారు. బతుకమ్మలను బస్సులో కాగ్నా నదికి తీసుకెళ్లి నిమర్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కాలానీకి చెందిన మహిళలు పాల్గొన్నారు. వికారాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ వికారాబాద్ జిల్లా కోట్ పల్లి మండలం జిన్నారం గ్రామంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబరాల్లో మండల పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు.






# 8వ రోజు సరస్వతి దేవి అలంకార దర్శనం

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 29(ప్రజా స్వరం )**

శరణ్య నవరాత్రి ఉత్సవాల భాగంగా మండల కేంద్రమైన దౌల్తాబాద్ దుర్గాభవాని దేవాలయం లో సోమవారం ఎనిమిదవ రోజు అమ్మవారు సోమవారంశ్రీ సరస్వతి దేవి అవతారం లో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారి దర్శనంతో తమ జీవితాలు ధన్యమయ్యాయని ఆనందం వ్యక్తం చేశారు. ప్రతిరోజు మాదిరిగానే ఈ రోజు కూడా అమ్మవారి సేవలో ముఖ్యరాజేశ్వరి, మహేష్, రాజలింగు, హేమలత, నర్సింలు, తూర్పు లావణ్య, స్వామిలు పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, పుష్పార్చనలు, అలంకరణలు, మంగళ వాద్యాలు, సాంప్రదాయ కీర్తనలు ఆలయ వాతావరణాన్ని ఆధ్యాత్మికతతో నింపాయి.



**సరస్వతి దేవి విశిష్టత**

సరస్వతి మాతను జ్ఞాన, విద్య, కళల దేవతగా భావిస్తారు. విద్యార్థులు, కళాకారులు, సంగీత ప్రేమికులు సరస్వతిని భక్తిపూర్వకంగా ఆరాధిస్తే విద్య, వివేకం, వాక్పటిమ, సృజనాత్మకత కలుగుతాయని శాస్త్రాలు చెబుతున్నాయి. నవరాత్రుల ఎనిమిదవ రోజున సరస్వతి దేవిని పూజించడం వల్ల అజ్ఞానం తొలగి జ్ఞాన దీప్తి ప్రసాదమవుతుందని విశ్వాసం. ఈ సందర్భంలో ఆలయ పురోహితులు మాట్లాడుతూ - "సరస్వతి మాతను భక్తితో ఆరాధించినవారికి జ్ఞానం, విద్యతో పాటు ఆత్మవిశ్వాసం, విజయం లభిస్తాయి" అని తెలిపారు.

**ఉత్సవ వైభవం**

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు. అమ్మవారి దివ్యదర్శనం కోసం క్యూలైన్లలో నిలబడి భక్తులు "జయ జయ సరస్వతి మాత" తీర్థప్రసాదాలను ఇవ్వడం జరిగింది నినాదాలతో ఆలయ పరిసరాలను మారుమ్రోగించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను ఇవ్వడం జరిగింది



## ఇంటి వద్దనే ఆరోగ్యవంతమైన ఆదునిక వైద్య సేవలు అందించడమే లక్ష్యం

- **శ్రీజీవ హెల్త్ కేర్ డైరక్టర్ డాక్టర్ శ్రీనివాస్**

**శామీర్ పేట సెప్టెంబర్ 29(ప్రజాస్వరం)**

రోగులకు సౌకర్యవంతమైన నమ్మకమైన శ్రద్ధతో కూడిన ఆరోగ్య సేవలు అందిచడమే శ్రీజీవ హెల్తేకేర్ ల్యాబ్ లక్ష్యమని రసాయన ఇంజనీర్ రవీంద్రనాద్ గుట్ట అన్నారు. ఆదివారం తూంకుంట మున్సిపాలిటిలో శ్రీజీవ హెల్త్ కేర్ ల్యాబ్ ను రవీంద్రనాద్ గుట్ట ముఖ్య అతిదిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంబించారు. అనంతరం శ్రీజీవ అధికారిక వెబ్సైట్ ను ఆవిష్కరించారు. అనంతరం శ్రీజీవ హెల్త్కేర్ డైరక్టర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీజీవ హెల్త్ కేర్ ల్యాబ్ హోమ్ డయాగ్నస్టిక్స్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకవస్తున్నామని ఇంటి వద్దనే ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. మూత్రపరీక్షలు, షుగర్, థైరాయిడ్, లిపిడ్ ప్రొఫైల్ వంటి ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ల్యాబ్ టెక్నిషియన్లు నేరుగా ఇంటికి వచ్చి రక్త నమూనాలు సేకరిస్తారని చెప్పారు. డిజిటల్ పోర్టులు తక్షణమే శ్రీజీవ వెబ్సైటెకి యాప్ ద్వార అందుబాటులోకి వస్తాయన్నారు. ఆన్లైన్ డాక్టర్ కన్సల్టేషన్ ద్వార రోగి పరిస్థితిని విశ్లేసిస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులకు, ఉద్యోగస్తులకు, ఆస్పత్రికి రావడానికి ఇబ్బంది పడే రోగులకు చాల సౌకర్యవంతంగా ఉంటుందని చెప్పారు. ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ రిపోర్టింగ్ ద్వార భరోసా కల్పించడానికి శ్రీజీవ హెల్త్ కేర్ కట్టుబడి ఉందన్నారు. ప్రతీ జీవితానికి విలువ ఉందని ప్రతీ జీవితానికి సంరక్షణ అవసరమని చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీజీవ హెల్త్ కేర్ డైరక్టర్ డాక్టర్ కల్యాని, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ షేక్ అబ్దుల్చోది, ల్యాబ్ టెక్నిషియన్ బాస్కర్, నితేష్ దేవి, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ గడ్డం వంశీ కృష్ణ కృషితో రామగిరి ఖిల్లాకు రోప్‌వే ఆమోదం

**మంథని/పెద్దపల్లి,సెప్టెంబర్29(ప్రజా స్వరం):**


రామగిరి ఖిల్లా పర్యాటకాభివృద్ధి కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న రోప్‌వే ప్రాజెక్టు కు కేంద్ర ప్రభుత్వ ఆమోదం లభించింది.ఈ ప్రాజెక్టు సాధనలో పలు స్థాయిల్లో నిరంతర కృషి చేసి,ప్రతిపాదనలు సమర్పించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ ప్రధాన పాత్ర పోషించారు.2.46 కోట్లు వ్యయంతో 2.1 కిలోమీటర్ల పొడవైన రోప్‌వే నిర్మాణం చేపడతారు.దీని ద్వారా కోట పాదాల నుండి కొండపై భాగానికి భక్తులు,పర్యాటకులు సులభంగా,సురక్షితంగా చేరుకోగలరు.అదనంగా,రామగిరి పరిసరాల్లో పర్యాటక అభివృద్ధికి మరో 2.5



కోట్లు కేటాయించబడ్డాయి.ఈ సందర్భంగా ఎంపీ వంశీ మాట్లాడుతూ ఇది చాలా కాలంగా సాగుతున్న పోరాటం రామగిరి చారిత్రక,ఆధ్యాత్మిక ప్రాముఖ్యతను వివరిస్తూ మౌలిక సదుపాయాల అవసరాన్ని పదేపదే ప్రతిపాదించాను.ఇప్పుడు ఆ కృషి ఫలించింది. రోప్‌వే వల్ల భక్తులు,పర్యాటకులకు సౌలభ్యం కలుగుతుంది.అదనంగా స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు,చిన్న వ్యాపారాలకు ఆదాయం వస్తుంది.రామగిరి అభివృద్ధి దిశగా ఇది ఒక కొత్త అధ్యాయం అని అన్నారు.ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే రామగిరి ఖిల్లా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందటమే కాకుండా,ప్రముఖ పర్యాటక కేంద్రంగా వెలుగొందనుంది.







## సరస్వతి దేవిగా దర్శనమిచిన అమ్మవారు

**శామీర్ పేట సెప్టెంబర్ 29(ప్రజాస్వరం)**

శ్రీ గాయత్రి మహా క్షేత్రంలో శ్రీ సరస్వతి దేవి అమ్మవారు దర్శనమిచ్చారు. శామీర్ పేట మండలం తూంకుంట పరిధిలోని శ్రీ గాయత్రి మహా క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ వ్యవస్థాపకులు శిష్య పరివ్రాజక వాక్ బ్రహ్మ, శ్రీ రాఘవేంద్ర స్వామి ఉపాసకులు డాక్టర్ ఎస్వీఎల్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



## వైభవంగా శ్రీమహాలక్ష్మి అమ్మవారి శోభాయాత్ర

**మంథని/పెద్దపల్లి,(ప్రజా స్వరం):**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంథని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గోపాల కలవలు ఉత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు.అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పట్టణ పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు.ఆలయం వద్ద,మందాట ప్రాంతాలతో పాటు శ్రీలక్ష్మి నారాయణ స్వామి గుడి వద్ద యువతీ,యువకులు ఉత్సాహంగా ఉట్టి కొట్టారు.అమ్మవారి శోభాయాత్రలో భజనలతో పాటు యువతీ, యువకులు భక్తులు భక్తి గీతాలు నృత్యాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు.ఆలయం లోని అమ్మవారి సన్నిధిలో ఆదివారం రాత్రి ఘనంగా చక్రిభజన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో వేద పండితులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.**
- **రెవెన్యూ శాఖపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్.**

**పెద్దపల్లి,సెప్టెంబర్29(ప్రజా స్వరం):**

భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రెవెన్యూ శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారం,భూ భారతి దరఖాస్తులు,ప్రజావాణి దరఖాస్తులు,మీ సేవా దరఖాస్తులు,పెండింగ్ భూ సేకరణ తదితర అంశాల పై



కలెక్టర్ మండలాల వారీగా సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల అర్హత ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.భూ భారతి పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను నిర్ణిత గడువు లోగా పూర్తి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య,సురేష్,తహసిల్దార్ లు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



## సద్దుల బతుకమ్మను సంబరంగా జరుపుకోవాలే.!

- **తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ.**
- **మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్.**

**మంథని/పెద్దపల్లి,సెప్టెంబర్29(ప్రజా స్వరం):**

తీరొక్క పూలతో సద్దుల బతుకమ్మ సంబరాలను సంతోషంగా జరుపుకోవాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆకాంక్షించారు.తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ సంబరాలు ప్రతీకగా నిలుస్తాయన్నారు.తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలను జరుపుకుని ఆఖరున సద్దుల బతుకమ్మ వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని,మహిళలు జరుపుకునే గొప్ప పండుగ అని అన్నారు.భవిష్యత్‌లో కూడా బతుకమ్మ వేడుకలను ప్రతి మహిళ ఆనందంగా జరుపుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.మంథని నియోజకవర్గంలోని మహిళలకు,ఆడబిడ్డలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.



## జిల్లా కలెక్టర్ ను కలిసిన నూతనంగా ఎంపికైనా గ్రూప్1 ఉద్యోగి


**పెద్దపల్లి,సెప్టెంబర్29(ప్రజా స్వరం):**

పెద్దపల్లి జిల్లా సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ను ఇటీవల నియమితులైన గ్రూప్1 ఉద్యోగి బనావత్ వనజ మర్యాద పూర్వకంగా కలిశారు.సెప్టెంబర్ 25న విడుదలైన గ్రూప్ 1ఫలితాలలో మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన బి.వనజకు 504.5 మార్కులతో 38వ ర్యాంక్ రావడంతో డిప్యూటీ కలెక్టర్ గా ఎంపిక చేయబడి పెద్దపల్లి జిల్లాకు శిక్షణ కోసం కేటాయించడం జరిగింది.సెప్టెంబర్ 27న ముఖ్యమంత్రి చేతుల మీదుగా అపాయింట్మెంట్ ఆర్డర్స్ తీసుకున్న తర్వాత సోమవారం కలెక్టరేట్ లోని ఛాంబర్ లో కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసి ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ గా విధులలో చేరారు.

# అక్రమంగా యూరియా తరలిస్తున్న వాహనం పట్టివేత

**మంథని/పెద్దపల్లి,సెప్టెంబర్ 29(ప్రజా స్వరం):**

పెద్దపల్లి జిల్లా మంథని పట్టణం నుండి అక్రమంగా తరలిపోతున్న యూరియాను పెద్దపల్లి జిల్లా మంథని మండలం అడవి సోమన్ పల్లి గ్రామంలోని చెక్ పోస్ట్ ప్రత్యేక అధికారులు పట్టుకున్నారు.మంథని మండల కేంద్రంలోని ఓ ఫెర్టిలైజర్ షాపు నుండి మినీ వ్యానులో 50 బస్తాల యూరియాతో అక్రమంగా తరలిపోతున్న వాహనాన్ని అడవి సోమన్ పల్లి చెక్ పోస్ట్ వద్ద ప్రత్యేక అధికారులు పట్టుకొని కేసు నమోదు చేశారు.జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు కేసు నమోదు చేసి రూ.10 వేలు జరిమానా విధించారు.యూరియా బస్తాలను స్వాధీనం చేసుకున్నారు.





# కాళ్లకల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



మనోహరబాద్, (ప్రజాస్వరం) :

మెదక్ జిల్లా మనోహరబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో బతుకమ్మ ఆటపాటలతో ఆడిపాడారు. ఆయా రాజకీయ పార్టీల నాయకులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. అక్కా చెల్లెళ్లకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలోని 4, 5 వార్డులలో ఆ వార్డుల నాయకులు దుర్గేష్ యాదవ్, ఇలేష్ యాదవ్ లు బతుకమ్మ ఆటా పాటలకు ప్రత్యేక ఏర్పాటు చేసి బతుకమ్మ ఆటకు ప్రోత్సహించారు. బీజేపీ నాయకులు పురం మహేష్, కాంగ్రెస్ నాయకులు వీరబోయిన గోపాల్ ముదిరాజ్, లద్ది పీర్ల శ్రీనివాస్ గౌడ్, ఇలేష్ యాదవ్, రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దుర్గం దుర్గేష్ యాదవ్, గుజ్జుల స్వామిలను బీజేపీ మాజీ అధ్యక్షులు కుమ్మరి కృష్ణ శాలువాలతో సత్కరించారు.











## ఎన్నికల ప్రవర్తన నియమావళి

# తప్పకుండా పాటించాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని

**పెద్దపల్లి,సెప్టెంబర్29(ప్రజా స్వరం):**

ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలోని తూచా తప్పకుండా పాటించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు.సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష డిసిపి కరుణాకర్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎంపిటిసి,జడ్పిటిసి,గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణ రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని అన్నారు.2 విడతలలో స్థానిక సంస్థల,2 విడుతలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని అన్నారు.ఎన్నికల షెడ్యూల్ విడుదల జరిగిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వెంటనే ఎన్నికలు జరిగే గ్రామీణ ప్రాంతాలలో అమలు లోకి రావడం జరుగుతుందని అన్నారు.ఎం.సి.సి నిబంధనల ప్రకారం 24 గంటలు,48 గంటలు,72 గంటల లోపు తీసుకోవాల్సిన చర్యలను చేపట్టే రిపోర్ట్ అందించాలని అన్నారు.






బ్యాలెట్ బాక్స్ పోలింగ్ పర్సనల్ ట్రైనింగ్స్ సరిపోయేంత మెటీరియల్ అన్ని సరిగా చూసుకోవాలన్నారు.ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్,డి.పి.ఓ.వీర బుచ్చయ్య,పెద్దపల్లి ఆర్డీఓ గంగయ్య ,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



# ముబారస్‌పూర్‌లో అక్షరాభ్యాస మహోత్సవం

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 29( ప్రజాస్వరం) :**

దౌల్తాబాద్ మండల పరిధిలోని ముబారస్ పూర్ గ్రామంలో శరణ్య నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం నాడు అమ్మవారు సరస్వతి దేవి రూపంలో అలంకరించబడి భక్తులకు దర్శనమిచ్చారు. విద్యాదేవి సరస్వతి అవతార దర్శనం కోసం ఉదయం నుంచే భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకుల ఆధ్వర్యంలో గ్రామంలో వందమంది చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషం. చిన్నారులు తల్లిదండ్రుల సమక్షంలో ఓం అనే అక్షరాన్ని రాయగా, పూజారులు వారికి ఆశీర్వచనాలు అందించారు. విద్యారంభ దినోత్సవం



కావడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ పిల్లలు చదువులో రాణించాలని ఆకాంక్షించారు. గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అక్షరాభ్యాసం చూసి ఆనందం వ్యక్తం చేశారు. నిర్వాహకులు పిల్లలు విద్యలో ముందుకు సాగాలని, అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. మండప నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.


## తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు

# బతుకమ్మ ప్రతీక

### ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి నివాసంలో వైభవంగా బతుకమ్మ సంబురాలు

**పరిగి, సెప్టెంబర్ 29(ప్రజా స్వరం):**

పరిగి పట్టణంలోని పరిగి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి నివాసంలో బతుకమ్మ సంబురాలు అంగరంగ వైభవంగా జరిగాయి.ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి సతీమణి టి.ఉమారామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మల పేర్చి మహిళలు ఆట,పాటలతో నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బతుకమ్మ సంబరాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని ,బతుకమ్మ పండుగ మహిళలకు ప్రత్యేకమైనదని, ఈ పండుగలో తెలంగాణ సాంప్రదాయం, ఆచారాలు, ఆత్మీయత ప్రతిబింబిస్తాయని రామ్మోహన్ రెడ్డి తెలిపారు.









## తెల్లాపూర్‌లో ఘనంగా

# బతుకమ్మ సంబురాలు





# దసరా పండుగ నాడు ముక్క సుక్క బంద్

- గాంధీ జయంతి నాడే దసరా
- మద్యం, మాంసం విక్రయాలకు అనుమతి లేదు
- ప్రభుత్వ ఖాజానాకు భారీగా గండిపడే అవకాశం




**మేడ్చల్, ప్రజాస్వరం :**

తెలంగాణలో వివిధ శుభకార్యాలు, పండుగలు, ఫంక్షన్లు ఏదైనా మాంసం, మద్యం లేనిదే కిక్కు ఉండదు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఇది ఓ ఆనవాయి తీగా వస్తోంది. ఇక దసరా అంటేనే ఓ కిక్కు ఏ పండుగకి లేనంతగా దసరాకు అంత జోష్ ఉంటుంది. ఇదే రోజు చుక్క... ముక్క ఉండాల్సిందే. పల్లె, పట్టణం అని తేడా లేకుండా మద్యం వినియోగం ఉంటుంది. కుటుంబ సభ్యులంతా మద్యం మత్తును... గమ్మత్తుగా ఎంజాయ్ చేస్తుంటారు. మద్యంతో పాటు మటన్, చికెన్ ఉండాల్సిందే. అయితే ఈసారి దసరాకు ముక్క, చుక్కపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఒకే రోజు గాంధీ జయంతి.. దసరా**

అక్టోబరు 2న గాంధీ జయంతి రోజు నాడే దసరా పండుగ కూడా వస్తోంది. ఈ నేపథ్యంలో మద్యం, మాంసం విక్రయాలపై ఆసక్తికర చర్చ నడుస్తోంది. సాధారణంగా గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం దుకాణాలు మూసి వేయడం ఆనవాయితీ. అయితే అన్ని పండుగల మాదిరిగా దసరా ఉండదు. ఆ రోజున చాలామందికి చుక్క లేనిదే ముద్ద తిగదు. అందుకోసం అక్టోబరు 2న మద్యం, మాంసం విక్రయాలపై తర్జన భర్జన పడుతున్నారు.

## మాంసానికి మస్తు గిరాకీ..

దసరాకి మాంసాహారులైన ప్రతి ఇంట్లో ముక్క ఉండాల్సిందే. గొర్రెలు, మేకలు, పొటేళ్లు, మేక పోతులను కోసి వాటాలు చేయాల్సిందే. నాటు కోళ్లు, పారం కోళ్లకు సైతం మస్తు గిరాకీ ఉంటోంది. ఇలా ప్రతి ఒక్కరూ పండుగ జరుపుకొంటారు. గ్రామాలు, పట్టణాలలోని వ్యాపారస్థులు, దుకాణదారులు పెద్ద పెద్ద వాహనాల యజమానులు దసరా పండుగ సందర్భంగా వారి దుకాణాలు, పరిశ్రమలు వాహనాల ముందు మేకలు, గొర్రెలను బలి ఇవ్వడం ఆనవాయితీ. ఇందుకోసం పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున మేకలు, గొర్రెలు, కోళ్లను వ్యాపారులు దిగుమతి చేసుకుంటారు. అయితే దసరాకు ఒక వేల మాంసం దుకాణాలను మూసివేసినట్లయితే ముక్కపై తీవ్ర ప్రభావం ఉంటుందని పలువురు మాంసంప్రియులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## మద్యం విక్రయిస్తే చర్యలు

దసరా, గాంధీ జయంతి ఒకేసారి రావడంతో వైన్స్, బార్ షాపులు ప్రభుత్వ ఆదేశాల మేరకు బంద్ ఉంటాయి. బెల్ట్ షాపు నిర్వాహకులు ఇతర షాపుల్లో మద్యం విక్రయాలు జరిపినట్లయితే కఠిన చర్యలు చేపడతాం.

**- నవనీత రెడ్డి, ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్**



# ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలి

## పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, సెప్టెంబర్29 (ప్రజా స్వరం) :**



ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం కలెక్టరేట్ లో వైద్య ఆరోగ్యశాఖ పని తీరుపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తల ద్వారా ప్రసవానికి దగ్గర గా ఉన్న గర్భిణీ మహిళలను ఫాలో అప్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో అధికంగా ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ప్రెగ్నెన్సీ గుర్తింపు నుంచి ప్రసూతి వరకు అన్ని దశలలో ప్రభుత్వ వైద్య సహాయం పొందాలని,ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్,టీకాలు 100శాతం జరిగేలా చూడాలని అన్నారు.ఆర్.బి.ఎస్.కే బృందాల పనితీరును పర్యవేక్షించాలని,పాఠశాలలను నిరంతరం తనిఖీ చేస్తూ పిల్లల ఆరోగ్య స్థితి గతులను రెగ్యులర్ గా చెక్ చేయాలని,అవసరమైన వారికి వైద్య చికిత్సలు అందజేయాలని అన్నారు. ఎన్.సి.డీ స్క్రీనింగ్ ప్రతి హెల్త్ సెంటర్ పరిధిలో పక్కాగా జరగాలని అన్నారు.నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు టీబి అనుమానితులను గుర్తించి నిర్ధారణ పరీక్షలు చేయాలని అన్నారు.సబ్ సెంటర్ నిర్మాణ మరమ్మత్తు పనులు సకాలంలో పూర్తి కావాలని అన్నారు .ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వాణి శ్రీ,జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, అధికారులు పాల్గొన్నారు.



# దౌల్తాబాద్‌లో కాంగ్రెస్ జెండాను ఎగరవెయ్యాలి

- దుబ్బాక నియోజకవర్గం చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**దౌల్తాబాద్ సెప్టెంబర్ 29 (ప్రజా స్వరం):**

దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డిని సోమవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో దౌల్తాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు పడాల రాములు, మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలోపేతం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల వ్యూహంపై చర్చించారు. నాయకులు మాట్లాడుతూ దౌల్తాబాద్ మండల పరిధిలో జెడ్పిటిసి, ఎంపిటిసి స్థానాల్లో గెలిచే అభ్యర్థులకు బీ-ఫారమ్ ఇవ్వాలని శ్రీనివాస్ రెడ్డిని అభ్యర్థించారు. దీనిపై ఆయన స్పందిస్తూ, "రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారాన్ని ప్రజల అభ్యున్నతికి ఉపయోగిస్తున్నాం. గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వార్డు సభ్యులు, సర్పంచులు మన పార్టీ నుంచే ఎన్నికవ్వాలి. అలా జరిగితే అభివృద్ధి పనులు వేగంగా జరుగుతాయి" అని పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను గుర్తు చేస్తూ ఆయన చెప్పారు: "రైతులకు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ధాన్యం సపోర్ట్ ధర, ఇళ్లులేని వారికి ఇండ్ల నిర్మాణం, విద్యార్థుల కోసం చదువు బాట, పేదలకు ఆహార భద్రత పథకం, మహిళల సాధికారత కోసం మహిళా ఆభయ హస్తం వంటి పథకాలు రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతున్నాయి. ఇవన్నీ ప్రతి గ్రామానికి చేరేలా మనం కృషి చేయాలి" అన్నారు. అంతేకాక రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి చర్యలను ప్రతి ఇంటికీ, ప్రతి ఓటరికి తీసుకెళ్లాలని కార్యకర్తలను పిలుపునిచ్చారు. "మనం అంతా కలిసికట్టుగా కృషి చేస్తే కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుంది. నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుంది" అని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఆయనను కలిసిన వారిలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బండారు లాలు కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మద్దెల స్వామి పడాల మల్లేశం పంచమి గణేష్ మల్లారెడ్డి తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# రెండు దఫాలుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ

- 3 దఫాలుగా సర్పంచ్ ఎన్నికలు
- రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని




**వికారాబాద్, సెప్టెంబర్ 29(ప్రజా స్వరం):**

రాష్ట్రంలో రెండు దఫాలుగా ఎంపిటిసి, జడ్పిటిసి, 3 దఫాలుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల అధికారి రాణి కుముదిని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నియమావళి అమలుపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లు తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, రెవిన్యూ అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ ,ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి , అదనపు కలెక్టర్ సుదీర్, డి ఆర్ ఓ మంగీ లాల్ లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అనుసరిస్తూ రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్ లను తొలగించాలని తెలిపారు. గ్రామ స్థాయిలో ఎన్నికల నిర్వహించడానికి అన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎన్నికలు నిర్వహణపై పిఓలు, ఏపిఓ లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎఫ్ఎస్టీ,ఎస్ఎస్టి,వీఎస్టీ,ఎంసిసి టీములను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎంపిటిసి, జడ్పిటిసి, వార్డు సభ్యులు, సర్పంచి ఎన్నికలు నిర్వహణకు సిబ్బందికి బాధ్యతలు అప్పగించాలన్నారు. బ్యాలెట్ బాక్స్ లను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో మరమ్మత్తు చేయించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో అదనపు పోలీస్ బలగాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి ఉండాలని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మద్యం, డబ్బు లేదా బహుమతుల తదితర కార్యక్రమాలు ద్వారా ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రయత్నాలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఏర్పాట్లను వేగవంతం చేయడంతో పాటు, అవసరమైన సిబ్బంది, భద్రతా బలగాల సమన్వయం మరియు ఐటీ ఆధారిత పర్యవేక్షణ చర్యలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న జిల్లాలలో బోర్డర్ చెక్ పోస్ట్ లను ఏర్పాటు చేసి తనికీలు చేపట్టాలని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టే అంశాలపై నిఘా పెంచాలని పర్యవేక్షణకు, ఫ్లైయింగ్ స్కాడ్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిగురించి ఎంపిడిఓలకు, తహసీల్దార్ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని తెలిపారు. నామినేషన్లు, కౌంటింగ్ ప్రక్రియపై సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు.పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీలకు రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలోని గ్రామ పంచాయతీలకు గాను మొదటి రెండవ, మూడవవిడతలలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల అధికారి కి వివరించారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరము జిల్లా కలెక్టర్ ఎం పి డి ఓలకు వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో తక్షణమే స్థానిక సంస్థల మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల ప్రవర్తన నియమావళి )అమలులోకి వచ్చినట్లు జిల్లా ఎన్నికల అథారిటీ, కలెక్టర్ సూచించారు. కోడ్ అమల్లో వచ్చిందని వెంటనే రాజకీయ ప్రచారాలు, పోస్టర్లు, ఫ్లెక్సీ లు, గోడ రాతలు తొలగించాలని ఆదేశించారు. ఈ రోజు నుండి ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశం లో జిల్లా పంచాయతి అధికారి జయసుధ, జిల్లా అధికారులు, ఎం పి డి ఓ లు, ఎం పి ఓ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999